క్లుప్తంగా

పోలీసుల కార్డెన్ సెర్చ్



దర్గాహొన్నూరులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని ఐదు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు పట్టణ సీఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులతో సీఐ సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, సంబరాలు చేసుకోవడం, టపాసులు కాల్చడం చేయరాదన్నారు. జూన్ 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు ఎస్ఐలు శ్రీనివాసులు, గురుప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే జైలుకే



పల్లేపల్లిలో ప్రజలకు సూచనలిస్తున్న తహసీల్దార్ చిట్టిబాబు

రాయదుర్గం రూరల్: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఈఆర్ఓ , తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మండలంలోని పల్లేపల్లి, మెచ్చిరి గ్రామాల్లో ఆయన అర్బన్ సీఐ శ్రీనివాసులుతో కలిసి ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్బన్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో బాణాసంచా పేల్చడం, సంబరాలు చేసుకోవద్దన్నారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు.

నేడు వీరశైవ ప్రతిభా పురస్కారాల ప్రదానం

ఉరవకొండ: నియోజకవర్గ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వీరశైవ విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఆదివారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రాయదుర్గంటౌన్: పట్టణం మీదుగా శనివారం ఉదయం ఎరువుల లోడుతో కర్ణాటకకు వెళ్తున్న ఐచర్ వాహనం బీటీపీ రోడ్డు రైల్వే గేటుకు సమీపంలో రోడ్డుపై కుంగిపోయింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎరువుల లోడు కావడంతో కొన్ని గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

జనార్దన వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి పూజలు



కూడేరు: ప్రత్యేక అలంకరణలో బసాపురం ఆంజనేయుడు

రాయదుర్గం రూరల్ : మండలంలోని వడ్రహొన్నూరులో వెలిసిన అపులాపురం ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖ విదియ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పవిత్ర గంగాజలంతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారికి వెండి కవచ అలంకరణ, ప్రత్యేక తులసిదళార్చన, కుంకుమార్చన, పుష్పాలంకరణ, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు చేశారు.

బొమ్మనహాళ్: నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం చేశారు. స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

కూడేరు: కూడేరుకు సమీపంలో ప్రసిద్ధిగాంచిన బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దుర్గ చైతన్య ఆంజనేయుడికి క్షీరాభిషేకం చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు.

వర్ష బీభత్సం

- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- కాదలూరులో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- బీటీప్రాజెక్టులోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- అత్యధికంగా కళ్యాణదుర్గం లో 86.4 మి.మీ వర్షపాతం

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వాన దంచి కొట్టింది. వర్షానికి తోడు గాలీవాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం రాత్రి మొదలైన వర్షం శనివారం వేకువ జాము వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. దీంతో పట్టణంలోని శాంతినగర్, బళ్లారి రోడ్డు దాటుకొని లోతట్టు ప్రాంతమైన రామస్వామివీధి, మధు టాకీస్ తదిత ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. డీ హీరేహాళ్ మండలంలోని కాదలూరులో వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మామిడి, సపోట, అల్లనేరేడు లాంటి పంటలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాలు రాత్రంతా చిమ్మచీకట్లోనే మగ్గాయి. పునరుద్దరణ కోసం విద్యుత్‌శాఖ అధికారులు శ్రమించారు. విడపనకల్లు, కుందుర్పి, కళ్యాణదుర్గం, కణేకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, శెట్టూరు, బొమ్మనహాళ్, బెళుగుప్ప మండలాల్లో అధికంగా వర్షం కురిసింది. నష్ట నివారణపై అధికారులు చర్యలు చేపట్టారు.

బీటీప్రాజెక్ట్‌లోకి కొనసాగుతున్న వరద: బీటీప్రాజెక్ట్‌లోకి వరదనీరు కొనసాగింది. ప్రాజెక్ట్ నీటి మట్టం 1,655 అడుగుకాగా, శనివారం సాయంత్రానికి 1,641.7 అడుగులకు వరదనీరు చేరింది. 280 క్యూసెక్కులతో ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్టు జేఈ హరీష్ తెలిపారు. ప్రాజెక్ట్ ఎగువ భాగం కర్ణాటక రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు వచ్చి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనాకు వచ్చారు.

వర్షపాతం నమోదు ఇలా.. : రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లోని అత్యధికంగా కళ్యాణదుర్గంలో 86.4 ఎంఎం, అత్యల్పంగా వజ్రకరూర్ లో 1.4 ఎంఎంగా నమోదైంది. కణేకల్లులో 70, బొమ్మనహాళ్‌లో 34.2, గుమ్మఘట్ట 27.2, రాయదుర్గం 25.6, డీ హీరేహాళ్ లో 17, కుందుర్పి 58.6, శెట్టూరు 44.2, కంబదూరు 7.2, బ్రహ్మసముద్రం 25.2, ఉరవకొండ 62.8, వజ్రకరూరు 46.2, బెళుగుప్ప 36.8, కూడేరు 20.2 ఎంఎం గా వర్షపాతం నమోదైంది.

నష్ట నివారణపై అంచనా

డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసిందని, ఎక్కడైన నష్టం జరిగి ఉంటే అంచనా వేసి పంపాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీసుస్మిత తెలిపారు. మరో రెండు, మూడు రోజులు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పిడుగులు పడే అవకాశం ఉన్నందున, పొలాల్లో పనులు చేసే రైతులు జాగ్రత్త వహించాలన్నారు.

గుమ్మఘట్ట: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. శుక్ర, శనివారం 27.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

కణేకల్లులో 70 ఎంఎం వర్షం

కణేకల్లు: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటల నుంచి శనివారం వేకువజాము వరకు వర్షం కురిసింది. వర్షపాతం 70 ఎంఎంగా నమోదైంది. కణేకల్లు, కణేకల్లు క్రాస్, నల్లంపల్లి, పుల్లంపల్లి, గోపులాపురం , యర్రగుంట తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. కణేకల్లులో 2, బ్రహ్మసముద్రంలో 2 విద్యుత్ స్తంభాలు ఈదురు గాలులకు పడిపోయాయి. బ్రహ్మసముద్రంలో ఈదురుగాలులకు పెద్ద చెట్లు నేలకొరిగాయి.

'దుర్గం'లో దంచేసిన వాన

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సాయంత్రం నుంచి ఏకధాటిగా రాత్రి 12 గంటల వరకు భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని పలు చోట్ల ఈదురు గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. నియోజకవర్గంలో కళ్యాణదుర్గంలో 86.4 మి.మీ, కుందుర్పిలో 58.6 మి.మీ, శెట్టూరులో 44.2 మి.మీ, బ్రహ్మసముద్రంలో 25.2 మి.మీ, కంబదూరులో 7.2 మి.మీల వర్షపాతం నమోదైంది.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి వర్షం కుండపోత వర్షం కురిసింది. 34.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి పత్తి పంటలు నీట మునిగింది. ఏకదాటిగా కురిసిన వర్షానికి కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. శ్రీధరఘట్ట చెరువుకు నీరు చేరాయి. పత్తి పంట నీటమునిగాయి.

కుందుర్పి: మండలంలో శుక్రవారం రాత్రి వర్ష బీభత్సం సృష్టించింది. ఈదురు గాలి, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో కదరంపల్లి, కెంచంపల్లి పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో వందేళ్ల నాటి చింత వృక్షాలు, జాలి, తుమ్మ, వేప తదితర చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు విరిగి పడ్డాయి. మండలంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కెంచంపల్లి ఎస్సీ కాలనీలోకి అటవీ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీరు ఇళ్లలోకి చేరింది. ఈదురుగాలికి రేరింగ్ షెడ్లు ఎగిరిపోయాయని బాధితులు తిప్పే స్వామి, జయరామప్ప, హరికృష్ణ, శ్రీనివాసులు తెలిపారు. కదరంపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ హనుమేష్ ఇంటిపై పిడుగు పడడంతో పైకప్పు గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే ప్రాణాపాయం తప్పింది.

చాపిరి చెరువుకు చేరిన వర్షపునీరు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వేసవిలో మండే ఎండలతో జనం అల్లాడారు. ఇటీవల వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఊరట చెందుతున్నారు. భారీ వర్షాలతో పంట పొలాల్లోని బోరుబావుల్లో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని రైతులు అంటున్నారు.



బీటీపీలోకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో



వరద నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో చెల్లాచెదురైన వస్తువులు



కాదలూరులో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

ఉరవకొండలో భారీ వర్షం



దుద్దేకుంట వద్ద నేలవాలిన బొప్పాయి పంట

ఉరవకొండ: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లాలోనే రికార్డు స్థాయిలో 63.78 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లపైన నీరు పారింది. డ్రైయినేజీలు పొంగిపొర్లాయి. పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీ, హమాలీ కాలనీ, ఇంద్రానగర్‌లోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. వంకలు, వాగులు పొంగిపొర్లాయి. బూదగవి చెరువు మరువ పారడంతో చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వెళ్లారు.

పొంగి పొర్లిన వంకలు వాగులు

విడపనకల్లు: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో శనివారం వాగులు వంకలు పొంగి పొర్లాయి. మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, పొలికి, ఆర్.కొట్టాల డొనేకల్లు వద్ద ఉన్న వంకలు వరద నీటితో ఉధృతంగా పారాయి. ఉండబండ, పాల్తూరు గ్రామాల మధ్య వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. పాల్తూరు, చీకలగురికి, హావలిగి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఈదురుగాలులతో భారీ నష్టం

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా ఉన్న బెళుగుప్ప, గంగవరం, బ్రాహ్మణపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 70 విద్యుత్ స్తంభాలు విరిగి, నేలకొరిగాయి.వీటితో పాటు 15 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో మండలంలోని 19 గ్రామ పంచాయతీలు కూడిన శుక్రవారం రాత్రి మొత్తం అంధకారంతో పాటు శనివారం సాయంత్రం వరకు విద్యుత్ స్తంభించింది. విద్యుత్‌శాఖ ఏఈ గురురాజ్ స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి కళ్యాణదుర్గం నుంచి బెళుగుప్పకు విద్యుత్ లైన్లు పునరుద్ధరించారు. దుద్దేకుంట వద్ద రైతు గోవర్ధన్‌కు చెందిన 2.5 ఎకరాల్లోని బొప్పాయి పంట నేలకొరిగింది. మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షపాతం 36.8 ఎంఎంగా నమోదయ్యిందని ఏఓ ఏఓ పృథ్వీసాగర్ తెలిపారు.



కళ్యాణదుర్గం కోటవీధిలో నేలకొరిగిన భారీ వృక్షం





బొమ్మనహాళ్ వద్ద నీట మునిగిన పత్తి పంట , భారీ వర్షానికి ఉరవకొండ నెహ్రూకాలనీలో చేరిన నీటిని చూపుతున్న కాలనీవాసులు

పాలిటెక్నిక్ కోర్సులతో అపార అవకాశాలు

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆష్రాఫ్ అలీ



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

ఉరవకొండ: పాలిటెక్నిక్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, కోర్సు పూర్తయిన వెంటనే అపారమైన అవకాశాలు ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆష్రాఫ్‌అలీ తెలిపారు. శనివారం మండలంలోని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ ద్వితీయ విజయోత్సవ వేడుక నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉరవకొండ 400 కేవీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణమూర్తి హాజరయ్యారు. కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించడంతో వారిని సత్కరించారు. నియామక పత్రాలు అందించారు. చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అకాడమిక్ స్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొని 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో పాటు మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థ ఒక విద్యార్థిని ఎంపిక చేసింది. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ హెడ్ రవీంద్రనాథ్, భౌతిక, ఆంగ్ల శాస్త్ర ఉపన్యాసకులు కె.ధనలక్ష్మి, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసులో ఇరికించేందుకే ఆరోపణలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వజ్రకరూరు: మండలంలోని పాతకడమలకుంటలో టీడీపీ నాయకుడు బొంబాయి సుంకప్పపై తాము దాడి చేసి, కులం పేరుతో దూషించలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరంగమ్మ, సింహాద్రి, అరవింద్, నరసింహులు తదితరులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తాము కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. శుక్రవారం తాము ఇంటి వద్ద ఉండగా బొంబాయి సుంకప్ప వచ్చి మంచి నీరు వదలడంలేదని గొడవకు దిగాడన్నారు. తాము గొడవ పడడం సరికాదని సర్ది చెప్పబోతుండగా, బొంబాయి సుంకప్ప, అతని కుమారుడు సంతోష్, కుటుంబ సభ్యులు దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించారన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు లక్ష్మీ రంగమ్మ తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే తమను కేసులో ఇరికించేందుకు డ్రామాకు తెరలేపారన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ ఇవ్వాలి

- విత్తన పంపిణీ పరిశీలనలో డీడీఏ శివప్రసాద్



ఉరవకొండలో రైతులకు విత్తన వేరుశనగ అందిస్తున్న డీడీఏ, అధికారులు

ఉరవకొండ: ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆశాఖ డీడీఏ శివప్రసాద్ ఆదేశించారు. శనివారం లత్తవరం, ఉరవకొండలో కొనసాగుతున్న రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని డీడీఏ పరిశీలించారు. అనంతరం ఉరవకొండ వ్యవసాయ శాఖ కార్యాలయంలోని రికార్డులను ఉరవకొండ ఏడీఏ పద్మజతో కలిసి డీడీఏ పరిశీలించారు. ఈసందర్భంగా డీడీఏ మాట్లాడుతూ రాయితీ విత్తనాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు కావాల్సినంత విత్తనాన్ని ఆర్‌బీకేలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. 20.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంకాధికారిణి ఆశా తెలిపారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరందుకుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తున్నారు. విత్తన వేరుశనగ కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ విజయకుమార్ తెలిపారు. అర్హత ఉన్న రైతులందరికీ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు, చీకలగురికి, ఉండబండ గ్రామాల్లో ఆర్‌బీకేలో డీడీఏ శివప్రసాదు, ఏడీఏ పద్మజ చేతుల మీదుగా రైతులకు వేరుశనగ శనివారం విత్తనం పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే 40శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనంను సద్వినియోగం చేసుకోవాలని డీడీఏ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ పెన్నయ్య, ఆర్‌బీకే సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

14,208 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా వున్న 15 ఆర్బీకే కేంద్రాల్లో 1,580 మంది రైతులకు 14,208 క్వింటాళ్ల విత్తన వేరుశనగను రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. మరో రెండురోజుల్లో 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సర్వీసులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 27 నుంచి 29 వరకు ప్రతి ఐదు నిమిషాలకు ఒక సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం బాలాజీ దయాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఉరవకొండ డిపోకు చేరుకొని అక్కడి నుంచి పెన్నహోబిలం సర్వీసులలో ప్రయాణించాలన్నారు. ఆటోలతో పాటు ప్రైవేట్ వాహనాల్లో భక్తులు వెళ్లొద్దన్నారు. దీంతో పాటు అనంతపురం, బళ్లారి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కుడా ఎలాంటి ఆటంకం లేకుండా సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● చెట్టంత 'ఆశ'యం



ఈదురు గాలికి నేలకొరిగిన నేరేడు చెట్టు

విత్తు నాటితే మొక్క మొలుస్తుంది.. నీరు పోస్తే చెట్టవుతుంది..సంరక్షిస్తే మహా వృక్షమై పండ్లు కాస్తుంది.. నీడనిస్తుంది..ఎందరికో ఊపిరినిస్తుంది.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం.. ఇది అందరికీ తెలిసిన సత్యమే.. ప్రతి ఒక్కరూ చెప్పే నీతి వాక్యమే.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని గోడలపై రాతలు, పేపర్‌పై సూక్తులు చెప్పే రోజులివి. అయితే కళ్యాణదుర్గం మండలం చాపిరిలో ఉపాధ్యాయుడు పాతిరెడ్డి తన పొలంలో 12 ఏళ్లుగా పెంచిన నేరేడు చెట్టు శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలికి నేలకొరిగింది. దాన్ని అలానే వదిలేసే కలపగా మార్చకుండా కొమ్మలు కత్తిరించి, తిరిగి యథాస్థానంలో నాటించారు. ఉపాధ్యాయుడు చేసిన ప్రయత్నం ఎందరికో ఆదర్శమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– కళ్యాణదుర్గం:



యథాస్థానంలో నాటిన చెట్టు

గెలుపు తలుపు తట్టేదెవరో?

- బూత్‌ల వారీగా కూడికలు, తీసివేతల్లో ప్రధాన పార్టీలు
- మెట్టు గెలుపుపై ఊపందుకున్న పందేలు
- రూరల్ ఏరియాలో పెరిగిన ఓటింగ్ శాతం

రాయదుర్గం : నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోరు ఉత్కంఠతను రేకెత్తిస్తోంది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గెలుపు కోసం నువ్వా- నేనా? అన్నట్టు సాగిన యుద్ధంలో విజయభేరి మోగించేది ఎవరో అంటూ సర్వాత్రా ఆసక్తి నెలకొంది. ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడేకొద్దీ నేతల్లోనూ టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. నియోజకవర్గంలోని 296 పోలింగ్ బూత్‌లు వాటి పరిధిలోని 2,64,352 మంది ఓటర్లు, 1,794 పోస్టల్ బ్యాలెట్లు నమోదయ్యాయి. ఇందులో 2,27,189 మంది ఓటర్లు, 1,605 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 85.94 శాతంతో 2,28,794 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో ఇన్‌వాలిడ్ ఓట్లు పోనూ, సగానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థి విజేతగా నిలవనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటేది ఎవరు..? ప్రత్యర్థి పార్టీకి ఎన్ని ఓట్లు రావచ్చు..? ఏ బూత్‌లో ఎక్కువ మెజార్టీ వస్తుంది?.. అనే కోణంలో లెక్కలేసుకుంటున్నారు.

పల్లెల్లో పుంజుకున్న ఓటింగ్ శాతం

గ్రామీణ ప్రాంతాల్లో ఓటుకు పోటెత్తారు. పట్టణ ఓటర్ల కంటే అధిక్యత చాటుకున్నారు. అత్యధికంగా డీ హీరేహాళ్‌లో 89.73 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ 36,853 మంది ఉండగా, 33,067 మంది ఓటేశారు. రాయదుర్గం రూరల్‌లో 34,548 కి 30,613 మంది ఓటేశారు. ఇక్కడ 88.61 శాతం నమోదైంది. గుమ్మఘట్టలో 39,809 ఓటర్లు ఉన్నారు. ఇందులో 35,232 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. 88.5 శాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో 46,680 మంది ఓటర్లకు గాను 40,270 మంది ఓటేశారు. 86.26 శాతానికి చేరింది. కణేకల్లు మండలంలో 53,023 మంది ఓటర్లు ఉండగా, 44,969 ఓట్లు పోలయ్యాయి. 84.41 శాతం. రాయదుర్గం అర్బన్‌లో 53,439 మంది ఓటర్లకు గాను, 43,038 ఓటేశారు. 80.54 శాతం మంది చివరి స్థానంలో నిలిచింది. రూరల్ ఏరియాలో పెరిగిన ఓటింగ్ శాతం ఆది నుంచి పట్టున్న వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి తోడు సంక్షేమ పథకాలు అందుకున్న మహిళలంతా జగనన్నకు జై కొట్టారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికి 15 వేలకు పైచిలుకు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



రాయదుర్గంలో ఈనెల 13న ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

'మెట్టు'గెలుపుపై ఊపందుకున్న పందేలు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గెలుపుపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గం సరిహద్దు ప్రాంతానికి ఆనుకొని ఉండడంతో కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాల్లోనూ మెట్టు గెలుపుపై పందేలు కాచే వారి సంఖ్య ఎక్కువైనట్టు తెలుస్తోంది. ఓటింగ్ సరళి, బూత్‌ల వారిగా విశ్లేషణ జరిపితే..మెట్టుకే అనుకూలమై ఉండొచ్చనే ఊహగానాలు తెరమీదికొస్తున్నాయి. ఈ నేపథ్యంలో పందెం రాయుళ్లు కాయ్ రాజా.. కాయ్..? అంటూ సవాల్ చేస్తున్నారు. టీడీపీలోనూ కొందరు బెట్టింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

2019 ఎన్నికలను పరిశీలిస్తే..

రాయదుర్గం నియోజకవర్గంలో 2019 ఎన్నికలను పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య ప్రధాన పోటీ సాగింది. ఆ ఎన్నికల్లో 316 పోలింగ్ బూత్‌లు 2,49,553 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,15,507 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అప్పట్లో 86.36 శాతం పోలింగ్ నమోదైంది. జనసేన, బీజేపీ, కాంగ్రెస్, ఇతర ఇండిపెండెంట్ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ప్రస్తుత టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుపై 14,463 ఓట్లతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయ కేతనం ఎగురవేశారు. ఈ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి భారీ విజయం తథ్యమని విశ్లేషకులు, మేధావులు భావిస్తున్నారు. ఏదిఏమైనా మరో ఎనిమిది రోజుల్లోనే అభ్యర్థుల భవిత్యం తేలనుంది.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

రాయదుర్గం రూరల్: కిశోరబాలికలు వారి ఆరోగ్యాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ సూచించారు. శనివారంమాసిక మహోత్సవంలో భాగంగా ఆమె చదం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ హెల్పర్లు ఆనందమ్మ, మారెక్క పాల్గొన్నారు.